సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 5 । మార్చి । 2024



సోమశిలలో 15.538 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 15.538 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3.350 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.65,580
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,889
3శాతం జీఎస్టీతో	రూ.6,066
నవర (8గ్రా)	రూ.48,528

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.2 /24.0

సోమవారం గాలిలో తేమ 59 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. మంగళవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

నేడు నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం

నెల్లూరు(దర్గామిట్ట): నగర పరిధిలోని వెంటేశ్వరపురం వద్ద గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి కోసం నిర్మించిన నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖపట్నం నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రూ.70 లక్షలతో ఈ కేంద్రాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించినట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి వినీల్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

మద్దతు ధరకు వేరుశనగ సేకరణ

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి వేరుశనగ సేకరణకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. సోమవారం కలెక్టర్ తన చాంబర్‌లో కొనుగోలు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 4,273 ఎకరాల్లో వేరుశనగ పంటను రైతులు సాగు చేశారని, ప్రభుత్వ నాణ్యత ప్రమాణాల మేరకు ఒక క్వింటాల్‌కు రూ.6,377 కనీస మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు. ప్రతి రైతుభరోసా కేంద్రం పరిధిలో వేరుశనగ మార్కెట్ ధర కనీస మద్దతు ధర కన్నా తక్కువ ఉంటే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పంటను సేకరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. వేరుశనగ రైతులు సోమవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు సీఎం యాప్‌లో గానీ, రైతుభరోసా కేంద్రాల్లో గానీ సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ డీఎం పవన్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, డీసీఓ సుధాభారతి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిలో బార్ సీజ్

కోవూరు: ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బుచ్చిరెడ్డిపాళెంలోని రాయల్ బార్ అండ్ రెస్టారెంట్‌ను ఎక్సైజ్, సెబ్ అధికారులు సోమవారం సీజ్ చేశారు. మండలంలోని పంచేడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సూరా శ్రీనివాసులురెడ్డికి చెందిన బార్‌లో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆ బార్‌ను సీజ్ చేశారు. బార్‌కు సంబంధించిన మద్యం సీసాలు ఇటీవల మినగల్లు గ్రామంలో దొరకడంతో విచారించిన అధికారులు బార్ సీజ్ చేశారు.

'సూర్య ఘర్'కు రిజిస్ట్రేషన్లు

నెల్లూరు(మినీబైపాస్): కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకానికి రిజిస్ట్రేషన్లు ప్రారంభించినట్లు తపాలా ఉద్యోగుల జిల్లా సెక్రటరీ (బీఎంఎస్) గుండ్రా మహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా సోలార్ పవర్ వినియోగాన్ని మరింత పెంచేందుకు సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని స్టోన్‌హౌస్‌పేట, ఇందుకూరుపేట, మైపాడు, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, బుచ్చిరెడ్డిపాళెం, దువ్వూరు, ఏకేనగర్ పోస్టాఫీసుల్లో 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కోసం ఈ పథకానికి రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు సమీప పోస్టాఫీసుల్లో సంప్రదించాలని తెలిపారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ప్రారంభం

నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్‌లో అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ అన్ని జిల్లాలో ప్రారంభమైందని ఏపీ ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారి పునీత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, కర్నూలు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన అభ్యర్థులందరూ ఈ నెల 22వ తేదీ లోపు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ అసిస్టెంట్, స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్‌మ్యాన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

అదిరే మెనూ.. ఆనందంగా తిను

గత ప్రభుత్వంలో సంక్షేమ వసతి గృహాల్లో ఆహారం అంటేనే ఉడికీ ఉడకని అన్నం.. నీళ్ల సాంబారు అని పేరు. అవి తినలేక విద్యార్థులు నానా అవస్థలు పడేవారు. కడుపు కాలి చదువుపై దృష్టి సారించలేకపోయేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పరిస్థితి పూర్తిగా మారింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల మెనూలో అనేక మార్పులు తీసుకువచ్చారు. వారంలో రోజుకో మెనూ అమలు చేస్తూ మధురమైన పౌష్టికాహారం అందిస్తూ విద్యార్థుల ఆకలి తీరుస్తున్నారు.

సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు పౌష్టికాహారం

- నాణ్యమైన ఆహారం తిని చదువుపై దృష్టి సారిస్తున్న పిల్లలు
- డైట్ చార్జీలను కూడా పెంచిన ప్రభుత్వం
- మెనూ అమలుపై ఆకస్మిక తనిఖీలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



బీసీ హాస్టల్‌లో భోజనానికి ముందు ప్రార్థన చేస్తున్న విద్యార్థినులు (ఫైల్)

నెల్లూరు(వేదాయపాళెం): రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో మెనూపై ప్రత్యేక దృష్టి సారించింది. భోజనంలో పలు మార్పులు తీసుకువచ్చి మధురమైన ఆహారం అందిస్తోంది. ప్రతి రోజూ ఉదయం పాలు, మల్టీ విటమిన్ చిక్కీలు, సాయంత్రం సమయంలో సేమ్యా పాయసం, ఉడికించిన పల్లీలు, రాగి లడ్డూ, మరమరాలు(బొరుగులు), రవ్వకేసరి అందిస్తోంది.



వసతి గృహంలోని చికెన్ బిర్యానీ

ఇందుకు అనుగుణంగా టీడీపీ హయాంలో ఉన్న డైట్ మెనూ చార్జీలను కూడా పెంచింది. గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రతి విద్యార్థికి నెలకు రూ.150 నుంచి రూ.200 వరకు అదనంగా అందించేలా ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచింది.

రుచికరమైన మెనూ

ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రస్తుతం ఉదయం అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకు రకరకాలైన వంటకాలను విద్యార్థుల కోసం తయారుచేసి అందిస్తున్నారు. ఉదయం 7 గంటలకు పాలు, అల్పాహారంగా పూరీ, పులిహోర, ఇడ్లీ, ఉప్మా, పొంగలి తదితర వాటిని వడ్డిస్తుండగా, రాత్రి ప్రతి రోజూ ఉడకబెట్టిన గుడ్డు, అరటి పండు, అన్నం, ఆకుకూర పప్పు, సాంబారు, పల్లీల చట్నీ, సాయంత్రం స్నాక్స్ వేరుశనగ చిక్కీలు అందిస్తున్నారు. ఇవన్నీ కాక, ప్రతి ఆదివారం మధ్యాహ్నం విధిగా చికెన్ బిర్యానీ పెడుతున్నారు. గతంలో వారంలో రెండు పర్యాయాలు మాత్రమే చికెన్ పెట్టే వెసులుబాటు ఉండేది. ప్రస్తుతం వారంలో మూడు సార్లు (ఆది, మంగళ, శుక్ర వారాల్లో) చికెన్ పెడుతున్నారు. విద్యార్థులకు అందించాల్సిన ఆహార పదార్థాలకు అయ్యే వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం 2023 ఫిబ్రవరి 20వ తేదీన మెస్ చార్జీలను పెంచుతూ జీఎంఎస్ నంబర్ 8 జారీ చేసింది. మెస్ చార్జీలతోపాటు కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచింది. పెరిగిన మెస్ చార్జీలకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మెనూ పక్కాగా అమలు చేస్తుండడం వల్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పైగా ప్రతి రోజూ విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను ఏ పూటకాపూట ఫొటోలు తీసి జిల్లాలోని సంక్షేమశాఖలకు చెందిన అధికారులతోపాటు రాష్ట్ర స్థాయిలోని అధికారులకు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. దీంతో మెనూలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా అమలు చేస్తున్నారు.

జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ల వివరాలు

	ప్రీ మెట్రిక్	కాలేజీ హాస్టల్స్	విద్యార్థుల సంఖ్య
ఎస్సీ	59	12	3,896
బీసీ	58	16	4,150
ఎస్టీ	13	2	1,480
మొత్తం	130	30	9,526

డైట్ చార్జీల పెంపు ఇలా..

3 నుంచి 4 తరగతి వరకు చదువుతూ సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు గత టీడీపీ ప్రభుత్వంలో నెలకు రూ.1,000 డైట్ చార్జీలు చెల్లించగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ మొత్తాన్ని రూ.1,150లకు పెంచింది. అలాగే 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రూ.1,250 నుంచి రూ.1,400లకు, ఇంటర్మీడియట్.. ఆపై చదువులు చదువుతున్న విద్యార్థులకు రూ.1,400 నుంచి రూ.1,600 ప్రస్తుత ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచింది.

కాస్మోటిక్ చార్జీల పెంపు ఇలా..

3 నుంచి 6వ తరగతి వరకు చదువుతూ సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న బాలురకు గత టీడీపీ ప్రభుత్వంలో నెలకు రూ.100 కాస్మోటిక్ చార్జీలు చెల్లించగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ మొత్తాన్ని రూ.125లకు, అలాగే బాలికలకు రూ.110 నుంచి రూ.130లకు కాస్మోటిక్ చార్జీలను పెంచింది. అదేవిధంగా 7 నుంచి 10 తరగతి వరకు చదువుతున్న బాలురకు రూ.125 నుంచి రూ.150లకు, బాలికలకు రూ.160 నుంచి రూ.200లకు కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. అలాగే ఇంటర్మీడియట్, ఆపై చదువులు చదువుతున్న బాలురకు రూ.155 నుంచి రూ.200లకు, బాలికలకు రూ.160 నుంచి రూ.250లకు కాస్మోటిక్ చార్జీలను పెంచి అందిస్తోంది.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ

సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు ఓవైపు పౌష్టికాహారాన్ని అందిస్తూనే మరోవైపు విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ప్రతి వసతి గృహాన్ని సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాలకు మ్యాపింగ్ చేశారు. దీంతో ఆయా సచివాలయాల్లోని ఏఎన్‌ఎంలు ప్రతి ఆదివారం హాస్టల్‌కు వచ్చి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నారు. అలాగే ప్రతి నెలా సమీపంలోని పీహెచ్‌సీ వైద్యసిబ్బంది వసతి గృహాలకు వెళ్లి విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్నారు. ఇలా విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతోపాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తూ వారు చక్కగా చదువుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండడంతో వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



నెల్లూరు బీవీనగర్‌లోని బీసీ బాలికల వసతి గృహంలో ఆహారాన్ని రుచి చూస్తున్న జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి వెంకటయ్య (ఫైల్)

మెనూ తప్పక పాటించాల్సిందే

ప్రస్తుతం మెస్ చార్జీలను పెంచిన నేపథ్యంలో అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మెనూ పక్కాగా అమలు చేస్తున్నారు. మెనూ అమలు చేస్తున్నారా లేదా అని పరిశీలించేందుకు ఆకస్మిక తనిఖీలు కూడా చేస్తున్నాం. విద్యార్థుల చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. – వై.వెంకటయ్య, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి

కావ్య.. ఉత్తుత్తి చేర్పులు ఏంటయ్యా!

- చంద్రబాబు మెప్పు కోసం కృష్ణారెడ్డి తిప్పలు
- స్థానికేతర అభ్యర్థితో క్యాడర్‌లో నిరుత్సాహం
- కావలి టీడీపీలో ఇదీ పరిస్థితి

కావలి/బిట్రగుంట: కావలి నియోజకవర్గంలో టీడీపీ ఆశలు పూర్తిగా గల్లంతవుతున్నాయి. ఇక్కడ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆర్.ప్రతాప్‌కుమార్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో దెబ్బకొట్టాలని టీడీపీ పన్నిన వ్యూహం ఆదిలోనే బెడిసికొట్టింది. ఏఎంసీ మాజీ చైర్మన్ సుకుమార్‌రెడ్డి తిరిగి పార్టీలో చేరడం, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో టీడీపీ ఆశలు పూర్తిగా ఆవిరయ్యాయి. వాస్తవానికి కావలి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోట. గత రెండు దఫాలుగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించారు. దీంతో ఖంగుతిన్న టీడీపీ అప్పటి నుంచి నిన్నమొన్నటి వరకూ దగదర్తి మండలానికి చెందిన మాలేపాటి సుబ్బానాయుడికి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకుంది. ఆయన టీడీపీ హయాంలో బీద రవిచంద్ర బినామీగా ఉండి విమానాశ్రయ భూములు, ఏపీఐఐసీ భూములు, ఎస్సీ, ఎస్టీ, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తరలించారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. తాజాగా టీడీపీ అధినేత చంద్రబాబు ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు. టికెట్ ఖరారు చేసుకున్న ఆయనవె వైఎస్సార్‌సీపీని దెబ్బకొట్టాలని వ్యూహాలు పన్నాడు. అందులో భాగంగా ఉత్తుత్తి చేర్పులు, సోషల్ మీడియాలో ప్రచారాలతో ఊదరగొడుతున్నాడు. ఎన్నికల్లో గెలుపు తనదేనని, ఎమ్మెల్యే ఇంటికి తాళం వేస్తానని ప్రగల్భాలు పలికేవరకూ వచ్చాడు. రాజకీయ కక్షలు, వివాదాలు లేకుండా ప్రశాంతంగా ఉన్న కావలిలో దగుమాటి వెంకటకృష్ణారెడ్డి వాఖ్యలు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి.

ఉత్తుత్తి చేర్పులు

చంద్రబాబు వద్ద మెప్పు పొందేందుకు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పార్టీలో ఉత్తుత్తి చేర్పుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామాల్లో అరకొరగా ఉన్న ఆ పార్టీ సానుభూతిపరులను ముసునూరులోని తన నివాసానికి పిలిపించుకుని కండువాలు కప్పి సోషల్ మీడియాలో ప్రచారం చేయించుకోవడం ప్రారంభించాడు. అదేదో పాత సినిమాలో చెల్లికి పెళ్లి.. జరగాలి మళ్లీమళ్లీ.. అనే చెత్తజోక్ లాగా కప్పిన వాళ్లకే మళ్లీ మళ్లీ కండువాలు కప్పుతూ కావలిలో టీడీపీ రాజకీయాన్ని కామెడీగా మార్చేశాడు.

విజయసాయిరెడ్డి రాకతో మారిన సమీకరణలు

కావలి నియోజకవర్గంలో తటస్థంగా ఉన్న ఓటర్లను డబ్బులు, తాయిలాలతో తమవైపు తిప్పుకుందామనే కావ్య కృష్ణారెడ్డి ఆశలకు నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి ఆరంగ్రేటంతో గండిపడింది. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్, అనుబంధ పరిశ్రమలతో నియోజకవర్గం పారిశ్రామికంగా వృద్ధి చెందుతున్న దశలో కేంద్రంతో మంచి సంబంధాలు ఉన్న విజయసాయిరెడ్డిని గెలిపించుకుంటే మరింత అభివృద్ధికి ఆస్కారం ఉంటుందనే ఉద్దేశంతో తటస్థులు, విద్యావంతులు, విశ్రాంత ఉద్యోగులు కూడా ఒక్కసారిగా వైఎస్సార్‌సీపీ వైపు మళ్లడంతో కావలిలో టీడీపీ శిబిరం డీలా పడింది.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపండి



అర్జీదారుడి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ హరినారాయణన్

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): 'జగనన్నకు చెబుదాం (స్పందన)' కార్యక్రమంలో ప్రజలు అందజేస్తున్న అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డీఆర్‌ఓ లవన్న, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీపీఓ సుస్మితతో కలిసి కలెక్టర్ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అందజేసిన వినతి పత్రాలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు అందించే అర్జీలను నిర్ణీత సమయం లోపు పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే వ్యక్తిగతంగా తనిఖీ చేసి సంతృప్తికరంగా పరిష్కారమార్గం చూపాలన్నారు. వృద్ధులు, దివ్యాంగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తోటపల్లిగూడూరు మండలం నరుకూరు గ్రామ పొదుపు సభ్యులు తమ గ్రామంలో పొదుపు మహిళలను మోసగించిన వీఓఏ సునీతపై చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రం అందజేశారు. కోమటిగుంట రాజుపాళెం గ్రామంలో బండ్ల దారిని దౌర్జన్యంగా ఆక్రమించి దున్నేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఇరిగేషన్, విద్యుత్ శాఖల ఎస్‌ఈలు కృష్ణమోహన్, విజయన్, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, హౌసింగ్, మెప్మా, ఐసీడీఎస్ పీడీలు నాగరాజు, రవీంద్ర, హేనా సుజన్, బీసీ, ఎస్సీ వెల్ఫేర్ అధికారులు వెంకటయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు 5,366 మందికి పోలియో చుక్కలు

నెల్లూరు(అర్బన్): పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో రెండో రోజు సోమవారం మిగిలిన ఐదేళ్ల లోపు వయస్సు గల 5,366 మంది చిన్నారులకు సిబ్బంది పోలియో చుక్కలు వేసి 1.83 శాతం లక్ష్యం సాధించారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించేందుకు వైద్యశాఖ సిబ్బంది ప్రతి ఇంటికీ తిరుగుతూ టీకాలు వేశారు. జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారులు 2,93,536 మంది ఉండగా, తొలి రోజు ఆదివారం 2,87,724 మందికి పోలియో టీకాలు వేసి 98.02 శాతం లక్ష్యాన్ని చేరుకున్న సంగతి తెలిసిందే. మొదటి, రెండు రోజులకు కలిపి మొత్తం 99.85 శాతం లక్ష్యం సాధించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మాట్లాడుతూ మంగళవారం సైతం తమ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఇంకా మిగిలిన చిన్నారులు ఉంటే వారికి కూడా పోలియో టీకాలు వేస్తారని తెలిపారు. ప్రధానంగా ఊరికి దూరంగా ఉండే కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు.

అధికారంలోకి వస్తే మేమేంటో చూపిస్తాం

- పోలీసులపై బెదిరింపులకు దిగిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు సిటీ: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమను ఇబ్బంది పెట్టిన పోలీసు అధికారులకు తామేంటో చూపిస్తామంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోలీసులను బెదిరించారు. నగరంలోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం నారాయణ గ్రూప్ జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, టీడీపీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నారాయణను, టీడీపీ సానుభూతిపరులను పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఇంటిలిజెన్స్ చీఫ్ సీతారామాంజనేయులు, కొల్లి రఘురామిరెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమను ఇబ్బంది పెట్టిన ఎవరినీ వదిలేది లేదన్నారు. వారి జాతకాలు బయటపెడతానని హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

8న బ్రాహ్మణ మహిళలకు సత్కారం

నెల్లూరు(బృందావనం): ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న వివిధ రంగాలకు చెందిన బ్రాహ్మణ మహిళలను బాలాజీనగర్‌లోని కొప్పరపువారివీధిలో ఉన్న ఐక్యవేదిక కార్యాలయంలో సత్కరించనున్నట్లు అఖిల బ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా శాఖ అధ్యక్షులు మైలవరపు మురళీమోహన్ సోమవారం తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన ప్రతిభావంతులైన బ్రాహ్మణ మహిళలు తమ వివరాలతో ఐక్యవేదిక అసోసియేట్ అధ్యక్షుడు శ్రీకంఠ రఘుకిషోర్‌ను 93923 42326 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

- రైల్వే సీఐ భుజంగరావు

నెల్లూరు(క్రైమ్): వేసవి సమీపిస్తున్న దృష్ట్యా రైళ్లలో నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని నెల్లూరు రైల్వే సీఐ భుజంగరావు సిబ్బందికి సూచించారు. సోమవారం రాత్రి నగరంలోని తన కార్యాలయంలో ఆర్పీఎఫ్, జీఆర్పీఎఫ్ సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఆయన నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా భుజంగరావు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా రైళ్లలో నేరాలు జరిగే అవకాశం ఉందని, సమష్టి కృషితో అరికట్టాలని సిబ్బందికి సూచించారు. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి గస్తీని ముమ్మరం చేయాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే గస్తీ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో నెల్లూరు, సూళ్లూరుపేట, గూడూరు ఆర్పీఎఫ్ అధికారులు వసంతరావు, వెంకటస్వామి, గుజరాల్, ఎస్సైలు హరిచందన, కొండపనాయుడు, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైల్వే సీఐ భుజంగరావు

రెవెన్యూ డే ప్రకటనపై హర్షం

నెల్లూరు(దర్గామిట్ట): ప్రతి సంవత్సరం జూన్ 20వ తేదీన రెవెన్యూ దినోత్సవం (రెవెన్యూ డే) జరపాలని నిర్ణయిస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అల్లంపాటి పెంచలరెడ్డి, కె.డానియల్ పీటర్‌రావ్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం తెలిపారు. ఆ రోజున రెవెన్యూ అధికారులు, సిబ్బంది సేవలను కొనియాడి సత్కరిస్తారన్నారు. జీఓ విడుదలకు సహకరించిన సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 132
లేయర్ (లైవ్)	: 70
బ్రాయిలర్ చికెన్	: 232
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 258
లేయర్ చికెన్	: 120

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.65
పండ్లు	: రూ.25

కొలువుల జాతర

చంద్రబాబు వస్తేనే జాబ్‌లు వస్తాయని ఆనాడు టీడీపీ ఊదరగొట్టింది. తీరా అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలిచ్చిన పాపాన పోలేదు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ఎంతోమంది నిరుద్యోగుల జీవితాల్లో వెలుగు నింపింది. గతంలో ఏళ్ల తరబడి నోటిఫికేషన్ల కోసం నిరీక్షించిన సందర్భాలున్నాయి. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యమని కలలు కన్నవారికి పైసా ఖర్చు లేకుండా, ఎవరి సిఫార్సు అవసరం లేకుండా ఉన్నత స్థాయిని అందించింది జగన్ ప్రభుత్వం.

- గతంలో బాబు వస్తేనే జాబు పేరుతో తెలుగుదేశం మోసం
- నేడు సచివాలయాల ఏర్పాటుతో వేలమందికి ఉద్యోగాలు
- కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్
- ప్రజలకు చేరువైన ప్రభుత్వ సేవలు



మనుబోలు మండలం వెంకన్నపాలెం సచివాలయంలో సేవల గురించి ఆరా తీస్తున్న కలెక్టర్ హరినారాయణన్ (ఫైల్)

నెల్లూరు(పొగతోట): గ్రామ, వార్డు సచివాలయాలు.. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు.. సంక్షేమ పథకాలను సులువుగా అందించేందుకు శ్రీకారం చుట్టిన వ్యవస్థ. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలను 2019 అక్టోబర్ 2వ తేదీన ప్రారంభించారు. దీంతో రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం సాకారమైంది. లక్షల మంది నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపింది. సచివాయాల్లో సిబ్బంది నియామకాన్ని ఏపీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ జారీ చేసి పారదర్శకంగా భర్తీ చేశారు. వివిధ శాఖల సిబ్బందిని నియమించారు. జిల్లాలో సుమారు 6,323 మందికి సచివాయాల్లో ఉద్యోగాలు కల్పించి ఆయా కుటుంబాల్లో జగన్ వెలుగులు నింపారు.

చంద్రబాబు ఉన్నప్పుడు..

2014 ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి వచ్చేందుకు ఎత్తులు వేసిన తెలుగుదేశం పార్టీ ఇంటికో ఉద్యోగం ఇస్తామని ప్రచారం చేసింది. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నిరుద్యోగులకు ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చారు. జాబు రావాలంటే బాబు రావాలి.. ఇంటికో ఉద్యోగం ఇస్తామని పేరుతో పదేపదే చెప్పారు. ఇది నమ్మి టీడీపీకి ఓటు వేసిన నిరుద్యోగులను నట్టేట ముంచారు. కనీసం ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయారు. ఆయన హయాంలో నోటిఫికేషన్ల కోసం ఎదురు చూసిన యువత అనేక సార్లు ధర్నాలు, ఆందోళనలు చేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. నిరుద్యోగ భృతి పేరుతో ఇచ్చిన హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదు.

జిల్లాలో..

సచివాలయాలు	769
గ్రామాల్లో	550
అర్బన్ పరిధిలో	219
ఉద్యోగాలు పొందిన వారు	6,323
వలంటీర్ల సంఖ్య	12,793

సీఎం జగన్ వచ్చాక..

జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక కొలువుల జాతర మొదలైంది. నిరుద్యోగుల కోసం నోటిఫికేషన్లు ఇచ్చారు. ఒక్కో సచివాయలంలో అడ్మిన్, వీఆర్వో, విలేజ్ సెక్రటరీ, వెల్ఫేర్, డిజిటల్, శానిటరీ, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, సివిల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్, సర్వేయర్, ఫిషరీస్, పశు సంవర్థక తదితర శాఖల ఉద్యోగులను నియమించారు. భర్తీ ప్రక్రియలో ఎక్కడా రాజకీయ జోక్యం లేదు. అంతా పారదర్శకంగా జరిగింది. ఇంకా వలంటీర్లను నియమించారు. దీంతో కిలోమీటర్ల దూరంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన పని ప్రజలకు లేకుండా పోయింది. సమయం, నగదు వృథా కాకుండా సులువుగా ప్రభుత్వ సేవలు పొందుతున్నారు. సంక్షేమ ఫలాలు, పింఛన్లు, రేషన్‌కార్డులు తదితరాలను ఇంటి ముంగిటకే వచ్చి చేరుతున్నారు. ఒకప్పుడు ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బందులు పడిన వారు నేడు దరఖాస్తు చేసుకున్న రోజుల వ్యవధిలోనే తీసుకుంటున్నారు.

సీఎం నిర్ణయం నిరుద్యోగులకు వరం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. అవినీతి, అక్రమాలకు తావులేకుండా భర్తీ ప్రక్రియను నిర్వహించారు. సీఎం తీసుకున్న నిర్ణయంతో వేలాది కుటుంబాలు సంతోషంగా ఉన్నాయి. వైఎస్ జగన్ వల్ల ప్రజలకు ప్రభుత్వ సేవలు సులువుగా అందుతున్నాయి.

– బెల్లంకొండ పాండురంగ, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు

సంతోషంగా ఉంది



కష్టపడి చదివి సచివాలయ ఉద్యోగం సాధించాను. ఎలాంటి సిఫార్సు లేకుండా రోస్టర్, మెరిట్ ప్రకారం ఉద్యోగాలను భర్తీ చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం వేలాది మంది నిరుద్యోగులకు ప్రభుత్వ జాబ్స్ లభించాయి. ఎంతో సంతోషంగా ఉంది.

– టి.సౌజన్య, మూలాపేట సచివాలయ సిబ్బంది, నెల్లూరు

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చారు. దీంతో లక్షలాది మంది నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. నిరుద్యోగులకు అండగా నిలిచిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– ఎల్.దీపిక, శాంతినగర్ సచివాలయ సిబ్బంది, నెల్లూరు

రూరల్‌ను నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మహిళతో మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ప్రజలు తనకు అవకాశమిస్తే రూరల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్ది చూపిస్తానని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ నియోజకవర్గం 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్ ఆధ్వర్యంలో సోమవారం పార్క్ సెంటర్ నుంచి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆయనకు మరోసారి అండగా నిలిస్తే మరింత సంక్షేమాన్ని అందిస్తారని తెలిపారు. తనకు ఇవే చివరి ఎన్నికలని, 2029లో పోటీ చేయనన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నిలబెట్టుకుంటానని చెప్పారు. మంచి చేసిన ఎమ్మెల్యేగా జనం గుండెల్లో చిరస్థాయిగా ఉండేందుకు కృషి చేస్తానన్నారు. వచ్చే ఐదేళ్ల కాలంలో రూరల్లో శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు పక్కా ప్రణాళికను సిద్ధం చేశానన్నారు. తాను రూరల్ సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్న పది నెలల కాలంలోనే రూ.150 కోట్లకు పైగా నిధులతో వివిధ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, ఏఎంసీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సీహెచ్ హరిబాబు యాదవ్, క్లస్టర్ అధ్యక్షుడు బెజవాడ మేఘనాథ్ సింగ్, ఏఎంసీ డైరెక్టర్ స్వర్ణా జీవన్ ప్రసాద్, అజీజ్, అబ్దుల్ రజాక్, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు నందూరి హరిత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వానికే జనం మద్దతు

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: 'జనం మద్దతు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే ఉంది. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే వారు మళ్లీ సీఎంను చేసుకుంటారు' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని తాతిరెడ్డిపల్లి, పుట్టువారిపల్లి, రాజవోలు గ్రామాల్లో విజయీభవ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఆత్మకూరు నుంచి తాను పోటీ చేస్తానని తెలిపారు. ప్రతిపక్ష పార్టీ అభ్యర్థిగా ఎవరో వస్తారంటూ సంవత్సరం నుంచి చెబుతున్నారన్నారు. అయితే ఇంత వరకు నిర్ణయించలేని పరిస్థితి ఉందన్నారు. ఎవరు వచ్చినా భయపడేది లేదని, ప్రజలందరి ఆశీర్వాదంతో తప్పక విజయం సాధిస్తానన్నారు. విజయీభవ యాత్రలో భాగంగా ఐదు సంవత్సరాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ, రానున్న రోజుల్లో ప్రజలకు ఏమి చేస్తామో తెలియజేస్తున్నామన్నారు. చుట్టపుచూపుగా వచ్చే వారికి ప్రజలు ఓట్లు వేయరని, తాను సైతం బలమైన అభ్యర్థి కోసం ఎదురు చూస్తున్నానని చెప్పారు. అనంతరం రాజవోలులో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, సర్పంచ్ జి.నరసయ్య, సొసైటీ చైర్మన్ కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, మాజీ చైర్మన్ నారసింహారెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సందానీ, నాయకులు ప్రసాద్‌రెడ్డి, సూరా శ్రీనివాసులు రెడ్డి, జిలానీ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో ముస్లింల చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని 2, 3, 49, 40 వార్డులకు చెందిన ముస్లింలు పెద్ద సంఖ్యలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ముస్లింలు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలోనే తమకు న్యాయం జరిగిందన్నారు. ఎమ్మెల్యే అన్ని విధాలా అండగా నిలిచారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఆయన్ను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ప్రజల ఆశీస్సులు సీఎం జగన్‌కే..

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్



కరపత్రం అందజేస్తున్న ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజల ఆశీస్సులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మెండుగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్ అన్నారు. నగరంలోని 42వ డివిజన్ ఖుద్దూస్ నగర్, 4వ డివిజన్ జాకీర్‌హుస్సేన్ నగర్, న్యూకాలనీ తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకునే అవకాశాన్ని జగనన్న తనకు కల్పించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓట్లు వేస్తామని చెబుతున్నారన్నారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ మైపాడు రోడ్డును నాలుగు లేన్లుగా అభివృద్ధి చేశారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ కరిముల్లా, పోలంరెడ్డి లక్ష్మీప్రత్యూష, నాయకులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



బాధితురాలి సమస్యలు వింటున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): స్పందన కార్యక్రమంలో అందే అర్జీలపై నిర్లక్ష్యంగా ఉండొద్దని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి జిల్లా పోలీస్ అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 95 మంది విచ్చేసి అర్జీలు అందజేశారు. ఉద్యోగాల పేరిట మోసగించారని, సైబర్ నేరాలు, అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, పిల్లలు ఆస్తి కోసం చిత్రహింసలు పెడుతున్నారని ఇలా వివిధ సమస్యలపై వచ్చిన వినతులను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత గడువులో చట్టపరిధిలో సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. భార్యాభర్తల విషయంలో తొందరపడి కేసులు నమోదు చేయకుండా కౌన్సెలింగ్ ఇచ్చి కాపురాలు చక్కదిద్దాలని సూచించారు. తల్లిదండ్రులను హింసించే పిల్లలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. చిన్నారులు, సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు, మహిళల సమస్యలపై తక్షణమే స్పందించి వాటిని పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ శాఖల్లో ఉద్యోగాల ఇప్పిస్తామని చెప్పేవారిని నమ్మి మోసపోవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ఏపీఆర్‌పీబీ ప్రసాద్, దిశ డీఎస్పీ టి.సాయినాథ్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

బుజబుజనెల్లూరుకు చెందిన శ్రీకాంత్ నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీని ఏర్పాటు చేశారు. మా నుంచి సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.30,000 చొప్పున తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారు. మేము కష్టపడి పనిచేశాం. తొలి నెల నుంచి జీతం అడుగుతుంటే ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఇస్తామని చెప్పి ఆరునెలలపాటు పని చేయించుకున్నారు. ఆ తర్వాత ప్రాజెక్టు ఫెయిలైందని చెప్పి జీతాలు ఎగ్గొట్టారు. సెక్యూరిటీ డిపాజిట్‌లు తిరిగి ఇవ్వలేదు. రాత్రికి రాత్రే కంపెనీ ఎత్తివేశారు. ఎంతోమందిని శ్రీకాంత్, అతని మనుషులు మోసగించారు. వారిపై చర్యలు తీసుకోవాలి.

– హరిత, వసీమ్, ఫిరోజ్, శివరామకృష్ణ

రోగులకు మెరుగైన వసతులు

నెల్లూరు(దర్గామిట్ట): ఆత్మకూరు జిల్లా ఆస్పత్రిలో రోగులకు అవసరమైన వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. నెల్లూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేపట్టాల్సిన పనులను గుర్తించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఫర్నిచర్, మరుగుదొడ్ల మరమ్మతులు, తలుపుల ఏర్పాట్లు, ప్లంబింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, సూపరింటెండెంట్ శేషారత్నం, ఆర్ఎంఓ ఉషాసుందరి, ఏపీ ఎంఎస్ఐడీసీ ఈఈ సుధాకర్‌గౌడ్, డీఈ సాంబశివరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి, ఏఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు



పురస్కారాలు అందుకున్న వారితో అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం లైన్‌మన్ దివాస్‌ను నెల్లూరు విద్యుత్ భవన్‌లోని స్కాడా కార్యాలయంలో టౌన్ డివిజన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ సిబ్బంది ఎంతో జాగ్రత్తతో పనిచేయాలన్నారు. ప్రాణాలకు తెగించి మరమ్మతులు చేసే సిబ్బందిని ఫ్రంట్ లైన్ వారియర్స్ అంటూ కొనియాడారు. నెల్లూరు టౌన్ పరిధిలోని 11 సెక్షన్లలో ప్రతిభ చూపిన శ్రీకాంత్, సునీల్, కృష్ణయ్య, పృథ్వీ, రెడ్డి, పెంచలనారాయణ, శీనయ్య, మూర్తి, షబ్బీర్, చంద్రబాబు, సయ్యద్ షఫీ ఉన్నారు. కార్యక్రమంలో డీఈఈలు శ్రీధర్, మధుసూదన్‌రెడ్డి, కిరణ్, ఏఈలు పాల్గొన్నారు.